




# కరపత్రం

SINCE 2014

గురువారం జూన్ 11, 2026 సంపుటి : 2 సంచిక : 240 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


# సుపరిపాలన అతిపెద్ద పరీక్ష

## ఎక్స్ వేదికగా మోడీ పోస్ట్



**న్యూఢిల్లీ,జూన్10 :**
ప్రధాని నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించారు. భారత్‌లో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన నేతగా ఆయన నిలిచారు. ఈసందర్భంగా తన 12 ఏళ్ల పాలనపై మోదీ ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టారు. 'ప్రజా సేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష. వినయం, అంకితభావం, కర్తవ్య దీక్షతో అవిశ్రాంతంగా పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందగలడు' అని మోదీ రాసుకొచ్చారు. ఇక, ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అనేకమంది ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ వేదికగా పోస్టులు పెడుతున్నారు.

## దర్శక దిగ్గజం భారతీరాజ కన్నుమూత

- భారతీరాజా భౌతిక కాయం వద్ద సిఎం విజయ్ నివాళి
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు ఆదేశం

తమిళ చలనచిత్ర చరిత్రలో గ్రామీణ కథలకు సరికొత్త దిశను చూపి, వెండితెరపై పల్లెటూరి అందాలను అత్యంత అద్భుతంగా ఆవిష్కరించిన సినీ దిగ్గజం, 'దర్శక ఇమయం' భారతీరాజా కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే అద్భుత చిత్రాలను అందించి, ప్రేక్షకులను అలరించిన ఆయన మృతి సినీ






రంగానికి తీరని లోటును మిగిల్చింది. 1941 జూలై 17న తమిళనాడులోని తేని జిల్లా అల్లినగరంలో జన్మించిన భారతీరాజా, 1977లో విడుదలైన 16 వయతినిలే' చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేసి అప్పట్లోనే పెద్ద సంచలనం సృష్టించారు.

## ఫ్యూచర్ సిటీని రద్దుచేస్తామంటే
# బండకేసి కొడతారు

### టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ

- ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అభివృద్ధిని అడ్డుకోవడమే బిజెపి, బిఆర్ఎస్ పని
- కడుపులో విషం పెట్టుకుని కుట్రలు చేస్తున్నారు
- నాలాల కబ్జాలతో హైదరాబాద్ మునిగి పోతోంది
- కబ్జాదారుల కోరలు పీకేందుకే హైడ్రా ఏర్పాటు
- బతుకమ్మకుంటను ఎడ్లకు రాసిచ్చిన కెసిఆర్
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థను ప్రారంభించిన సిఎం రేవంత్



**హైదరాబాద్,జూన్ 10:**
ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని కొందరు మాట్లాడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తు నగరాన్ని రద్దు చేస్తామంటే బండకేసి కొడతారని హెచ్చరించారు. బుధవారం భారత్ ఫ్యూచర్ సిటీలో.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ భవనాన్ని ప్రారంభించారు. అలాగే లోగో, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. అలాంటి వారికి రాజకీయంగా భవిష్యత్ ఉండదని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్‌ను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. అభివృద్ధి జరగొద్దని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రాచార్యుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. మారీచుడు, సుభాహు జనంలోకి వచ్చారని సెటైర్లు గుప్పించారు. వీళ్లంతా కలిసి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. కడుపునిండా విషం నింపుకొని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఏడ్చేవాళ్లు ఏడవండి.. తాము అభివృద్ధి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నిన్న 2 గంటల వర్షానికే హైదరాబాద్ వరదమయమైందని చెప్పుకొచ్చారు. ఇదేనా మీ పదేళ్ల అభివృద్ధి? అని ప్రశ్నించారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బతుకమ్మ కుంట ఏమైనా ఎడ్ల సుధాకర్ తాత ఆస్తినా అని ప్రశ్నించారు. అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను ఎడ్ల సుధాకర్‌కు కేసీఆర్ రాసిచ్చారు. ఆనాటి నాయకులు ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు. అందుకే, హైడ్రాతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. చెరువులను పునరుద్ధరిస్తున్నాం. లేక్ ఎకానమీ సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచదేశాలను ఇక్కడికి రప్పించాం. డిసెంబర్‌లోనూ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కబ్జాకోరులు బాధపడినా పర్వాలేదు.. తమ ప్రయత్నం ఆగదని తేల్చిచెప్పారు. కబ్జాకోరుల కోరలు పీకుతాం.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. తెలంగాణకు 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని వ్యాఖ్యానించారు.

2లో..



## పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

- గిరిజన హక్కుల పరిరక్షణకు చట్టం కీలకం
- పీసా చట్టంపై వర్క్‌షాపు ప్రారంభించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్,జూన్ 10**
పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి గిరిజన హక్కులను కాపాడాలన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు పీసా చట్టం కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించి... ప్రసంగించారు. పీసా చట్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన అవసరమని తెలిపారు. పీసా కేవలం చట్టం కాదని.. ఆదివాసీల స్వయం నిర్ణయాధికారానికి రక్షణ కవచమని వెల్లడించారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని.. గ్రామసభలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని మంత్రి తెలిపారు. సహజ వనరులపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించిందన్నారు.

మిగతాద్ది 2 లో



## ప్రధాని మోడీ సరికొత్త రికార్డు

- అత్యధిక కాలం ప్రధానిగా నెహ్రూ రికార్డు బ్రేక్
- మీనాక్షి వ్యవహారం ఎన్నికల సంఘం పరిధిలోనిదన్న బండి

**కరీంనగర్,జూన్10 :**
భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కువ కాలం ప్రధానిగా కొనసాగిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును నరేంద్ర మోదీ బ్రేక్ చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందిస్తున్న రికార్డు మోదీ పేరిట లిఖించబడిందని ఆయన కొనియాడారు.

మిగతాద్ది 2 లో

## చారిత్రక మైలురాయిని
# అధిగమించిన మోడీ

- » భారతీయుల ఆకాంక్షలకు ప్రతీక మోడీ
- » ఎక్స్ వేదికగా రాంచంద్రారవు అభినందనలు



**హైదరాబాద్,జూన్10 :**
ఎన్నికైన ప్రధాన మంత్రిగా అత్యధిక కాలం సేవలందించిన నరేంద్ర మోదీ ఒక చరిత్రాత్మక మైలురాయి అధిగమించారని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఆయన 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసం, ఆకాంక్షలకు ప్రతీక అని పేర్కొన్నారు. 4,399 రోజులు.. భారతీయ చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిన చరిత్రాత్మక రోజులని చెప్పారు. గరీబ్ కల్యాణ్ నుంచి మహిళా సాధికారత వరకు.. రైతుల గౌరవం నుంచి యువతకు అవకాశాల సృష్టి వరకు.. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల నుంచి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వరకు..

2లో..



## ప్రైవేట్ కేసును అడ్డంపెట్టుకుని కుట్ర

» మీనాక్షి నామినేషన్ తిరస్కరణపై చామల

**హైదరాబాద్,జూన్10 :**
మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించడంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఓ ప్రైవేట్ కేసును అడ్డం పెట్టుకొని కావాలనే మీనాక్షి నటరాజన్ నామినేషన్ రిజెక్ట్ చేశారని విమర్శించారు.

# ఫ్రెండ్లీ పోలీసింగ్
## సాధారణ ప్రజలకు మాత్రమే

- రౌడీలు, గూండాల పట్ల కఠినంగానే వ్యవహరిస్తాం
- గంజాయి సాగు చేస్తే రైతు సంక్షేమ పథకాలు నిలుపుదల
- సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం
- రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ స్పష్టీకరణ

**ఆదిలాబాద్,జూన్ 10 :**
తెలంగాణలో పోలీసింగ్ విధానంలో కీలక మార్పులకు సంకేతాలు ఇస్తూ డీజీపీ సీవీ ఆనంద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇకపై 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అనే పేరుతో నేరస్తుల పట్ల సానుభూతి ఉండదని, ప్రజలను గౌరవిస్తాం.. కానీ రౌడీలు, గుండాలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.






## మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు

- పాదచారులకు ఇబ్బంది కలిగించడంపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్,జూన్ 10 :**
మెట్రోస్టేషన్ల కింద పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్ ప్రాంతాల్లో స్టాళ్ల ఏర్పాటుపై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది.








## రేవంత్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదు

- తెలంగాణలో ఇక బిజెపిదే తదుపరి అధికారం
- బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ జోస్యం

**భువనగిరి,జూన్ 10 :**
వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డికి ఘోర ఓటమి తప్పదని నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అర్వింద్ తెలిపారు.

2 లో



## సిద్ధాపూర్ రిజర్వాయర్‌కు మరో రూ.200 కోట్లు: మంత్రి ఉత్తమ్

**మహదేవ్‌పూర్:**
కాంగ్రెస్ పాలనలో నిర్మించిన అన్ని ప్రాజెక్టులు గట్టిగా నిలబడ్డాయని, బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన కాళేశ్వరం వాళ్ల హయాంలోనే కూలిపోయిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

# దర్శక దిగ్గజం భారతీరాజ కన్నుమూత

మొదటి పేజీ తరువాయి

అప్పటివరకు స్టూడియోలకే పరిమితమైన సినిమాలను అవుట్‌డోర్‌కు తీసుకొచ్చి, తమిళ సినిమాల్లో గ్రామీణ జీవన విధానాన్ని , అక్కడి సహజత్వాన్ని కళ్లకు కట్టినట్లు చూపించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అందుకే ఆయనను అభిమానులు, పరిశ్రమ వర్గాలు ఎంతో గౌరవంగా 'దర్శక ఇమయం' అని పిలుచుకుంటారు. ఆయన కెరీర్‌లో సిగప్పు రోజక్కల్, కిజక్కే పోగుం రైల్, అలైగల్ ఓయ్వతి÷-లలై, ముదల్ మరియాదై, కరుత్తమ్మ వంటి ఎన్నో క్లాసిక్ చిత్రాలను తెరకెక్కించారు. ఆయన మృతికి సినీ, రాజకీయ పరిశ్రమకు చెందిన పలువురు సంతాపం తెలిపారు. సిఎం విజయ్ నివాళి అర్పించారు.

# ప్రధాని మోడీ సరికొత్త రికార్డు

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. 'రాబోయే 2047 సంవత్సరం వరకూ నరేంద్ర మోదీయే దేశ ప్రధానిగా కొనసాగాలి. విప్లవాత్మక నిర్ణయాల వల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్టలు శరవేగంగా పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారత్‌ను 'విశ్వగురు' స్థానంలో నిలబెట్టడం ఖాయం' అని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందించారు. ఆ వివాదం పూర్తిగా ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని, చట్టప్రకారం ఈసీనే దానిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు

# ప్రైవేట్ కేసును అడ్డంపెట్టుకుని కుట్ర

మొదటి పేజీ తరువాయి

బీఎన్‌ఎస్ యాక్ట్ 230 ప్రకారం ఫామ్ 26 సబ్మిట్ చేయాల్సిన అవసరం లేదన్నారు. బీజేపీ.. ఎన్నికలను వాళ్ల ఖాతాలో వేసుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ఈడీ, సీబీఐ, ఈసీని అడ్డం పెట్టుకొని బీజేపీ ఎన్నికల్లో గెలుస్తోందన్నారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీకి రెండు రాజ్యసభ సీట్లకు అవకాశం ఉందని.. కాంగ్రెస్‌కు ఒక రాజ్యసభ వచ్చే అవకాశం ఉందని ఎంపీ తెలిపారు. మూడో అభ్యర్థిని బీజేపీ ఎందుకు పోటీలో నిలబెడుతోందని ప్రశ్నించారు. ముందు నుంచే మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను తప్పించాలని బీజేపీ చూసిందని వ్యాఖ్యానించారు. బీజేపీ చేస్తున్న కుటిల రాజకీయం గురించి దేశ ప్రజలకు తెలియాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటే అని విమర్శించారు. రెండు పార్టీలు కలిసి కాంగ్రెస్‌ను లేకుండా చేయాలని కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ సమర్థిస్తుందా అని ప్రశ్నించారు. చిల్లర రాజకీయాలు చేస్తే ఎప్పటికీ అధికారంలోకి రారని చామల కిరణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

# ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధారణ ప్రజలకు మాత్రమే

మొదటి పేజీ తరువాయి

జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మావోయిజం పూర్తిగా అంతమైందన్నారు. ఈ నేపథ్యంలో గ్రేహౌండ్స్ విభాగాన్ని పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. గ్రేహౌండ్స్‌లో పనిచేస్తున్న సిబ్బందిని కొత్త విభాగాలకు బదిలీ చేస్తూ, వారి సేవలను ఇతర కీలక రంగాల్లో వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రానికి గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పెద్ద సవాల్‌గా మారిందని డీజీపీ పేర్కొన్నారు. వాటి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. డ్రగ్స్ ముఠాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, నేరస్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూపాలపల్లి, ఏటూరు నాగారం, నర్సంపేట, ఆదిలాబాద్ తదితర అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు ఉందని ప్రస్తావించారు. గంజాయి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని, రైతుబంధు కూడా నిలిపి వేస్తున్నామని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.అదేవిధంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, సైబర్ క్రైమ్ ఇప్పుడు పోలీసు శాఖకు ప్రధాన సవాల్‌గా మారిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అద్భుతంగా పనిచేస్తున్నారని డీజీపీ ప్రశంసించారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసు వ్యవస్థ సైతం మారాల్సిన అవసరం ఉందని, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇక, ప్రజలకు భరోసా ఇచ్చే పోలీసింగ్ కొనసాగుతుంది. కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకునే రౌడీలు, గూండాలకు మాత్రం కఠినమైన పోలీసింగ్ తప్పదనే విషయం గుర్తుంచుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులతో ఫ్రెండ్లీగా ఉంటామని వ్యాఖ్యానించారు. రౌడీషీటర్లు, తదితర నేరస్తుల విషయంలో కఠినంగానే ఉంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది పెట్టే ఎవరినీ కూడా వదలబోమని స్పష్టం చేశారు. తెలంగాణలో నక్సలైట్ల సమస్య లేదని తెలిపారు. దేశవ్యాప్తంగా ఏడాది కాలంలో రోడ్డుప్రమాదాల్లో..1.70 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని డీజీపీ చెప్పుకొచ్చారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌పై ప్రజలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. మైనర్ల డ్రైవింగ్.. దేశంలో పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. తల్లిదండ్రులు వారికి వాహనాలు కొనిస్తున్నారని.. అందువల్లే ఇబ్బందులు వస్తున్నాయని వివరించారు. అన్నీ సమస్యలు పోలీసులతోనే పరిష్కారం కావని... ప్రజల సహకారం చాలా అవసరమని చెప్పుకొచ్చారు.

# ఫ్యూచర్ సిటీని రద్దుచేస్తామంటే బండకేసి కొడతారు

మొదటి పేజీ తరువాయి

ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం నిలుస్తుందని పేర్కొన్నారు. టోక్యో, సింగపూర్‌తో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ అని ఉద్ఘాటించారు. ప్రపంచ దేశాలను ఫ్యూచర్ సిటీకి తీసుకొస్తున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసం మాత్రమే కాదు.. మొత్తం ప్రపంచానికని అన్నారు. 150 రోజుల్లోనే ఈ కార్యాలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీకి ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరాన్ని
విస్తరించడం వల్లే ప్రపంచపటంలో ప్రత్యేక స్థానం లభించింది. బంగారం ధర కంటే రంగారెడ్డి భూముల ధరలే ఎక్కువ. ఆనాటి నిజాంలు, కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరాన్ని అనేకసార్లు విస్తరించారు. హైటెక్‌సిటీ, ఓఆర్ఆర్, జీనోమ్ వ్యాలీని అడ్డుకోవాలని చాలా మంది కుట్రలు చేశారు. నగరాన్ని విస్తరించకపోతే 10లక్షల మంది ఐటీ నిపుణులు రాణించేవారా అని అన్నారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారు. బీఆర్ఎస్ రద్దయిన నోటు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. ఇలాగే ప్రవర్తిస్తే వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదని హెచ్చరించారు.

# పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

మొదటి పేజీ తరువాయి

చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కార్పొరేట్ల చేతుల్లోకి సహజ వనరులు వెళ్లకూడదన్నారు. పీసా చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఉన్నవారి కోసం కాదు.. లేని వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ అని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని సీతక్క వెల్లడించారు. గుట్టలు కరిగిపోతున్నాయని.. సహజ వనరులు క్షీణిస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామసభలను మరింత బలోపేతం చేయాలన్నారు. పీసా అమలులోని సవాళ్లకు వర్క్‌షాప్ చర్చలు పరిష్కార మార్గాలు చూపాలని తెలిపారు. 'సర్పంచ్ సంవాద్' ద్వారా 4,500 మంది సర్పంచులు ఒకే వేదికపైకి వచ్చారన్నారు. సాంకేతికతతో గ్రామీణ పాలనను మరింత సమర్థవంతం చేస్తున్నామని తెలిపారు. పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదని.. గ్రామస్థాయిలో ఫలితాలు కనిపించాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని తెలిపారు. పీసా చట్టం అమలుకు గ్రామసభల నిర్ణయాలకు గౌరవం కల్పించాలన్నారు.

# రేవంత్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదు

మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డికి చదువు రాదని ఆయన వ్యంగ్యంగా అన్నారు. బుధవారం భువనగిరిలో ఎంపీ ధర్మపురి అర్వింద్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్‌పై ఈ రాష్ట్రంలో కేసు ఉన్నట్లు ఎన్నికల సంఘానికి ఎలా తెలిసిందంటూ సందేహం వ్యక్తం చేశారు. ఇది రేవంత్ రెడ్డి కుట్రో, కాంగ్రెస్ పార్టీ కుట్రో వాళ్లే తెలుసుకోవాల్సి ఉందని బీజేపీ ఎంపీ అభిప్రాయపడ్డారు. బీజేపీ నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు ఉండడం సహజమన్నారు. నరేంద్రమోదీ చరిష్మాను ఓట్లుగా మార్చుకోవడంలో తెలంగాణ బీజేపీ విఫలమైందని విమర్శించారు. అక్రమ ఇసుక రవాణాకు లారీలు దొరుకుతున్నాయి.. కానీ ధాన్యం రవాణాకు దొరకడం లేదా? అంటూ ఆయన అనుమానం వ్యక్తం చేశారు. త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కంటే తెలంగాణలో బీజేపీ విజయం సాధించడం సులభమన్నారు. తెలంగాణ ప్రభుత్వం గత రెండేళ్లుగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి 32 లక్షల టన్నుల బియ్యం బకాయిగా ఉందని చెప్పారు. నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రతిపక్షం లేదన్నారు. కానీ నేడు చాలా ప్రతిపక్షాలు ఉన్న సమయంలో 12 ఏళ్ల పాటు మోదీ ప్రధానిగా ఉన్నారని ఎంపీ అర్వింద్ వివరించారు.

# మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు

మొదటి పేజీ తరువాయి

పాదచారులు నడిచే ప్రాంతాలను లీజుకు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరాలు సమర్పించారు. మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల విషయంలో ఇప్పటికే జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అలాగే వీధి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న జీహెచ్‌ఎంసీ, మెట్రోస్టేషన్ల కింద ఉన్న వాణిజ్య స్టాళ్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో హైకోర్టు ఫుట్‌పాత్ స్థలాన్ని లీజుకు లేదా అద్దెకు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. పాదచారుల కోసం ఉద్దేశించిన ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి ఇవ్వడం ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని ఆదేశించింది. ఈ ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారో పూర్తి నివేదికను సమర్పించాలని జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఆర్‌ఎంఎల్‌లకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# సిద్ధాపూర్ రిజర్వాయర్‌కు మరో రూ.200 కోట్లు: మంత్రి ఉత్తమ్

మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం, మేడిగడ్డ, సుందిళ్ల పరిస్థితి ఏమైందో అందరూ గమనించాలన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన ఆయన.. జాకోరా, చందూర్ ఎత్తిపోతలను ప్రారంభించారు. సిద్ధాపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. అనంతరం స్థానికంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. సవరించిన అంచనాల మేరకు సిద్ధాపూర్ రిజర్వాయర్‌కు మరో రూ.200 కోట్లు మంజూరు చేస్తామన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో పూడికతీత పనులు చేపడతామని తెలిపారు. కాలువలను సౌర విద్యుత్ ఉత్పత్తికి వినియోగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.
అనంతరం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ బ్యారేజీని మంత్రి ఉత్తమ్ పరిశీలించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్లా బ్యారేజీల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బ్యారేజీ మార్పుతోనే పెద్ద తప్పు జరిగిందన్నారు. ప్రపంచ స్థాయి నిపుణులు, సంస్థల సహకారంతో 2027 జులై వరకు పునరుద్ధారణ పూర్తి చేస్తామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా ఒక చుక్క నీరు వినియోగం చేయకుండా రికార్డు స్థాయిలో 2.95 లక్షల మెట్రిక్ టన్నులు ధ్యానం కొనుగోలు చేపట్టామన్నారు.

# చారిత్రక మైలురాయిని అధిగమించిన మోడీ

మొదటి పేజీ తరువాయి

ఆర్థిక వ్యవస్థ ఫార్మలైజేషన్ నుంచి ప్రపంచ వేదికపై దేశ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం వరకు.. ప్రతి రంగంలోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు, బలమైన జాతీయ భద్రతా విధానం, నక్సలిజం క్షీణత, ఈశాన్య భారతంలో శాంతి, అభివృద్ధి, బలమైన సరిహద్దులు, విస్తృతమైన సామాజిక భద్రతా వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన ఆధునికీకరణ, భారత స్టార్టప్ సంస్కృతి ఎదుగుదల.. ఇవన్నీ జాతీయ పునరుజ్జీవనానికి కొత్త యుగాన్ని సూచిస్తున్నాయని ఎక్స్‌లో పోస్టు చేశారు.

# భారతీరాజా గొప్ప సృష్టికర్త
## దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ నివాళి

ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ లెజెండరీ దర్శకుడు భారతీరాజా మృతి పట్ల స్పందిస్తూ ఎక్స్ వేదికగా భావోద్వేగ పోస్ట్ పెట్టాడు. చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన భారతీరాజా మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసిన వర్మ.. ఆయన కేవలం ఒక దర్శకుడు మాత్రమే కాదని, సినిమా రంగాన్ని కొత్త కోణంలో చూపించిన ఒక గొప్ప సృష్టికర్త అని వర్మ అభివర్ణించారు.భారతీయ చలనచిత్ర రంగానికి 'శ్రీదేవి' లాంటి దేశంలోనే అతిపెద్ద లేడీ సూపర్ స్టార్‌ను అందించడమే కాకుండా.. సత్యజిత్ రే మార్క్ 'యదార్థవాదాన్ని' హృషికేష్ ముఖర్జీ తరహా 'పాత్రలను', బసు ఛటర్జీ శైలి 'సిట్యుయేషనల్ కామెడీలను' భారతీరాజా అద్భుతంగా మిక్స్ చేశారంటూ వర్మ చెప్పుకోచ్చాడు. నేల విడవని సంప్రదాయాలు, మన మూలాలకు దగ్గరగా ఉండే కథలతో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆయన కనెక్ట్ చేశారు. భాషలతో సంబంధం లేకుండా అందరి హృదయాలను గెలుచుకున్న ఆయన ఒక నిజమైన సృష్టికర్త అంటూ రామ్ గోపాల్ వర్మ రాసుకోచ్చాడు.

# కోలివింగ్ హాస్టళ్లపై విచారణ చేయాలి ప్రభుత్వానికి విహెచ్ డిమాండ్

ప్రస్తుత సమాజంలో యువతీ యువకులు కలిసి ఉండే 'కో లివింగ్ హాస్టల్స్' సంస్కృతిపై సర్వత్రా చర్చ నడుస్తున్న వేళ.. ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు
కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ హాస్టల్స్ నిర్వహణ తీరు, అక్కడ అసలు ఏం జరుగుతోంది, యువత ఏ విధంగా ప్రభావితమవుతోంది అనే అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం నడుస్తున్న కో-లివింగ్ హాస్టల్స్‌లో అసలు ఏం జరుగుతుందో క్షుణ్ణంగా పరిశీలించాలి. అక్కడ చోటుచేసుకుంటున్న పరిస్థితులపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలి. అలా చేసిన తర్వాతే వాటిని పూర్తిగా రద్దు చేయాలా? లేక కఠినమైన నిబంధనలను అమలు చేయాలా? అన్న విషయంపై స్పష్టత వస్తుంది. ఇలాంటి హాస్టల్స్ పరిధిలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే సమాజంలో, మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కో-లివింగ్ హాస్టల్స్‌లో అమ్మాయిల తప్పా? లేక అబ్బాయిల తప్పా? తెలుసుకోవాలి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలంటే కమిటీ ద్వారా సమగ్ర విచారణ జరిపించి, నివేదిక ఆధారంగా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలి' అని అన్నారు.

# దర్శక దిగ్గజం భారతీరాజ కన్నుమూత తమిళ చిత్రపరిశ్రమ దిగ్భ్రాంతి

తమిళ చలనచిత్ర చరిత్రలో గ్రామీణ కథలకు సరికొత్త దిశను చూపి, వెండితెరపై పల్లెటూరి అందాలను అత్యంత అద్భుతంగా ఆవిష్కరించిన సినీ దిగ్గజం, 'దర్శక ఇమయం' భారతీరాజా కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే అద్భుత చిత్రాలను అందించి, ప్రేక్షకులను అలరించిన ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటును మిగిల్చింది. 1941 జూలై 17న తమిళనాడులోని తేని జిల్లా అల్లినగరంలో జన్మించిన భారతీరాజా, 1977లో విడుదలైన 16 వయతినిలే' చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేసి అప్పట్లోనే పెద్ద సంచలనం సృష్టించారు. అప్పటివరకు స్టూడియోలకే పరిమితమైన సినిమాలను అవుట్‌డోర్‌కు తీసుకొచ్చి, తమిళ సినిమాల్లో గ్రామీణ జీవన విధానాన్ని , అక్కడి సహజత్వాన్ని కళ్లకు కట్టినట్లు చూపించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అందుకే ఆయనను అభిమానులు, పరిశ్రమ వర్గాలు ఎంతో గౌరవంగా 'దర్శక ఇమయం' అని పిలుచుకుంటారు. ఆయన కెరీర్‌లో సిగప్పు రోజక్కల్, కిజక్కే పోగుం రైల్, అలైగల్ ఓయ్వతి÷-లలై, ముదల్ మరియాదై, కరుత్తమ్మ వంటి ఎన్నో క్లాసిక్ చిత్రాలను తెరకెక్కించారు. ఆయన మృతికి సినీ, రాజకీయ పరిశ్రమకు చెందిన పలువురు సంతాపం తెలిపారు. సిఎం విజయ్ నివాళి అర్పించారు.

# రిదిగ్గజ చలనచిత్ర దర్శకుడు భారతీరాజాకు సిఎం విజయ్ నివాళి అర్పించారు.

భారతీరాజా నివాసానికి వెళ్లిన సిఎం ఆయన భౌతికకాయం వద్ద పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తమిళ చిత్ర పరిశ్రమకు చేసిన సేవలను గుర్తు చేశారు. అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రకటించారు. తమిళ చలనచిత్ర పరిశ్రమకు ఆయన చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అంతకుముందు, తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ తమ వ్యవస్థాపకుడు, దిగ్గజ దర్శకుడైన భారతీరాజా తుది వీడ్కోలుకు ప్రభుత్వ అధికారిక లాంఛనాలను కల్పించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసింది. అసోసియేషన్ అభ్యర్థనకు స్పందించిన సీఎం విజయ్, ప్రభుత్వ గౌరవ వందనంతో ఆయన అంత్యక్రియలు జరుగుతాయని వెల్లడించారు. ఈ సందర్భంగా తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, భారతీయ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రభావవంతమైన, విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన మహోన్నత వ్యక్తి భారతీరాజా అని కొనియాడింది. కేంద్ర ప్రభుత్వం నుంచి అందుకున్న ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' (2004) పురస్కారంతో పాటు 6 జాతీయ చలనచిత్ర అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డులను మరియు మరెన్నో ప్రశంసలను ఆయన అందుకున్నారని గుర్తుచేసింది. భారతీయ సినిమాకు ఆయన అందించిన సహకారం అసమానమైనదని, ఒక దర్శకుడిగా ఎన్నో కాలాతీత క్లాసిక్ చిత్రాలను సృష్టించడమే కాకుండా, నటుడిగానూ తన అద్భుత నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారని ప్రశంసించింది. 2020లో పలువురు నిర్మాతలతో కలిసి భారతీరాజా 'తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్' ను స్థాపించారని, ఆయన దూరదృష్టితో కూడిన నాయకత్వంలో ఈ అసోసియేషన్ స్థిరంగా వృద్ధి చెంది ప్రస్తుతం 400 మందికి పైగా క్రియాశీల నిర్మాతలకు ప్రాతినిధ్యం వహిస్తోందని సంస్థ తెలిపింది. నిర్మాతలు, దర్శకులు, నటుల సంక్షేమం కోసం మరియు తమిళ సినిమా సమగ్ర అభివృద్ధి కోసం ఆయన ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేశారని, అసోసియేషన్ చేపట్టే ప్రతి కార్యక్రమానికి ఆయన నిరంతరం మద్దతుగా నిలిచారని ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ తమ ప్రకటనలో కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకుంది.

# భారతీరాజా మృతి తీరని లోటు
## ఆయన దర్శకత్వంలో నటించడం గొప్ప అనుభూతి
### - నివాళి అర్పించిన మెగాస్టార్ చిరంజీవి

విలక్షణ కథాంశాలతో యావత్ దేశాన్ని మెప్పించిన ఈ 'దర్శక శిఖరం' భారతీరాజా మరణవార్తతో అటు కోలీవుడ్, ఇటు టాలీవుడ్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాయి. ఆయన భౌతికకాయానికి నివాళులర్పించేందుకు సినీ ప్రముఖులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ విషాద సమయంలో మెగాస్టార్ చిరంజీవి సామాజిక మాధ్యమాల ద్వారా స్పందిస్తూ అత్యంత ఎమోషనల్ అయ్యారు. భారతీయ చలనచిత్ర రంగం ఇవాళ ఒక అసాధారణ కథకుడిని కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెటూరి మట్టి పరిమళాలను, అచ్చమైన మానవ సంబంధాల సున్నితత్వాన్ని, అమాయకత్వంతో కూడిన ప్రేమను, సామాన్యుల జీవితాల్లోని భావోద్వేగాలను వెండితెరపై అద్భుతమైన కావ్యాలుగా మలిచిన ఘనత భారతీరాజా గారికే దక్కుతుందని చిరంజీవి కొనియాడారు. ఆయన సృష్టించిన చిత్రాలు కేవలం ప్రేక్షకులను అలరించడమే కాకుండా, రాబోయే ఎన్నో తరాల యువ దర్శకులకు దిక్సూచిలా, స్ఫూర్తిప్రదాతగా నిలిచాయని పేర్కొన్నారు. ముఖ్యంగా 1987లో భారతీరాజా గారి దర్శకత్వంలో వచ్చిన క్లాసిక్ ఎమోషనల్ డ్రామా 'ఆరాధన' చిత్రంలో తామిద్దరం కలిసి పనిచేసిన మధుర జ్ఞాపకాలను చిరంజీవి ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు. ఆ సినిమాలో తాను పోషించిన 'పులిరాజు' అనే వైవిధ్యమైన పాత్ర తన కెరీర్‌లో ఎప్పటికీ ప్రత్యేకమని, అటువంటి గొప్ప పాత్రను తనతో చేయించిన అదృష్టం ఆ దర్శకేంద్రుడి వల్లే దక్కిందని చెప్పారు. షూటింగ్ సమయంలో సినిమా పట్ల భారతీరాజా గారికి ఉన్న ప్యాషన్, ఆయన చూపించిన అంకితభావం, అంత పెద్ద దర్శకుడైనా ఆయనలో ఉన్న నిరాడంబరత్వం తన మనసుపై ఎనలేని ముద్ర వేశాయని మెగాస్టార్ గుర్తుచేసుకున్నారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలు అమూల్యమైనవని, ఆయన భౌతికంగా మనల్ని విడిచివెళ్లినా ఆయన చిత్రాల ద్వారా ఎప్పటికీ చిరస్మరణీయంగానే ఉంటారని పేర్కొంటూ, శోకతప్త కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికతో జమ్మికుంటలో అభివృద్ధి పరుగులు

- వార్డుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ -- ప్రజల భాగస్వామ్యంతో పట్టణాభివృద్ధి: మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి


9th & 11th ward sir


2nd వార్డ్ మెడికల్ క్యాంపు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 10:** జమ్మికుంట పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడం, వార్డుల వారీగా ప్రజా సమస్యలను గుర్తించి వేగంగా పరిష్కరించడం తమ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న వార్డ్ సభలు ప్రజల సమస్యలకు వేదికగా మారాయని వారు తెలిపారు.

బుధవారం 1, 2, 3, 8, 9, 11, 13, 14, 15, 16, 21వ వార్డుల్లో నిర్వహించిన వార్డ్ సభల్లో పాల్గొన్న చైర్మన్, కమిషనర్ ప్రజలతో నేరుగా మమేకమై సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వాటి అమలులో ప్రజల సహకారం అవసరమని సూచించారు.

వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్యలు, పారిశుధ్యం, మురుగునీటి కాలువలు, వీధి దీపాలు, రహదారుల మరమ్మతులు, ప్రజా ఆరోగ్యం, వర్షాకాల సన్నద్ధత వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, సూచనలను నమోదు చేసి, వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం కీలకం అని పేర్కొంటూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపల్ నిబంధనలను పాటించాలని కోరారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు.

అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్ఠాత్మక "జల్ సంచయ్ -- జల్ భాగీదారి" కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పరిరక్షణకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైన్ల పూడికతీత, కాలువల శుభ్రపరిచే పనులు, నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు, దోమల నివారణ కార్యక్రమాలు, పారిశుధ్య పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రోడ్ల మరమ్మతులు, కొత్త వీధి దీపాల ఏర్పాటు, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి వార్డును ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దేందుకు మున్సిపాలిటీ కృషి చేస్తోందని వెల్లడించారు. ధర్మారం వార్డు సభలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరం (హెల్త్ క్యాంపు) నిర్వహించడం విశేషమన్నారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ అసిస్టెంట్లు ఏ. భాస్కర్, శ్రీనివాస్, ఐ. రమేష్, కౌన్సిలర్లు పోలు దివ్య, పోల్నేని శిల్ప, కొలకాని రాజకుమారి, కొలుగూరి సురేష్, పొనగంటి రాము, విష్ణు, ఎగితా సుజాత, మైస శిరీష, పి. మౌనిక, కొలుగూరి సురంజన్, చింతల శ్రీనివాస్, వార్డు అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందని, జమ్మికుంటను అన్ని రంగాల్లో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి కొనసాగుతుందని మున్సిపల్ యంత్రాంగం స్పష్టం చేసింది.

# 8వ వార్డు సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేసిన గూడెపు వంశీకృష్ణ (వకీల్)

- ప్రజాపాలన కార్యక్రమంలో వార్డు అభివృద్ధిపై కీలక డిమాండ్లు -- సానుకూలంగా స్పందించిన మున్సిపల్ చైర్మన్



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 10:** జమ్మికుంట పురపాలక సంఘం పరిధిలో నిర్వహిస్తున్న పట్టణ ప్రగతి -- ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 8వ వార్డుకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థి గూడెపు వంశీకృష్ణ (వకీల్) వార్డులో నెలకొన్న పలు ప్రధాన సమస్యలపై మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ దిలీప్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ 8వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా కేరళ స్కూల్ ఎదురుగా ఉన్న సందీప్ కిరణం వెనుక ఇట్టం సిద్ధిరాములు గల్లీలో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని, దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే మారుతి నగర్‌కు వెళ్లే ఛత్రపతి శివాజీ విగ్రహం నుంచి ప్రభుత్వ గిడ్డంగుల వరకు 30 అడుగుల సీసీ రహదారి నిర్మించాలని, ఇప్పటికే స్థలం కేటాయించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని త్వరితగతిన నిర్మించాలని కోరారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని 8వ వార్డు, మారుతి నగర్ ప్రాంతాల్లో మురికి కాలువలను తరచూ శుభ్రం చేయడంతో పాటు అవసరమైన చోట్ల కొత్త కాలువల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

మారుతి నగర్‌కు ప్రత్యేక రేషన్ షాపు కేటాయించేందుకు జిల్లా పౌరసరఫరాల అధికారులకు సిఫార్సు చేయాలని, పంచముఖ హనుమాన్ దేవాలయం సమీపంలో మరియు ప్రభుత్వ గిడ్డంగుల వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా 6, 7 వార్డుల నుంచి వచ్చే వరద నీటి ప్రవాహానికి ప్రధాన మార్గంగా ఉన్న 8వ వార్డు వరద కాలువలను 12 అడుగుల వెడల్పుతో విస్తరించాలని, వార్డు అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ దిలీప్ కుమార్ స్పందిస్తూ, ప్రతిపాదించిన సమస్యలను మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి సాధ్యమైనంత మేరకు నిధులు కేటాయించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వార్డు అభివృద్ధికి తమ పాలకవర్గం కట్టుబడి ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కోలుగురి సురేష్, వార్డు అధికారి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు, మహిళా సంఘాల ఆర్పీలు, వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ధ్యేయం -- జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ కీలక నిర్ణయాలు

- ఇల్లందకుంట, వీణవంకలో ఆధునిక సబ్ మార్కెట్ యార్డుల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- రైతులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు పాలకవర్గ సమావేశంలో తీర్మానాలు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 10:** కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న--సదానందం అధ్యక్షతన పాలకవర్గ సాధారణ సమావేశం ఘనంగా నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించి రాష్ట్ర పట్ల గౌరవాన్ని చాటుకున్నారు. అనంతరం మార్కెట్ కమిటీ అభివృద్ధి, రైతుల సంక్షేమం, మౌలిక వసతుల విస్తరణకు సంబంధించిన పలు కీలక అంశాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించి ముఖ్యమైన తీర్మానాలను ఆమోదించారు.

సమావేశంలో ముందుగా మార్చి--2026, ఏప్రిల్--2026, మే--2026 నెలలకు సంబంధించిన ఆదాయ--వ్యయ లెక్కలను సమగ్రంగా సమీక్షించారు. మార్కెట్ కమిటీ ఆర్థిక పరిస్థితి, ఆదాయ వనరులు, ఖర్చుల వివరాలను పరిశీలిస్తూ భవిష్యత్ కార్యాచరణపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఆదాయాన్ని పెంచడంతో పాటు రైతులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

రైతుల సౌకర్యార్థం ఇల్లంతకుంట మరియు వీణవంక మండల కేంద్రాల్లో అన్ని ఆధునిక వసతులతో కూడిన సబ్ మార్కెట్ యార్డుల నిర్మాణం చేపట్టాలని పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ యార్డుల ద్వారా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను స్థానికంగానే విక్రయించుకునే అవకాశం లభించడంతో పాటు రవాణా ఖర్చులు, సమయ వ్యయం తగ్గనున్నట్లు సభ్యులు అభిప్రాయపడ్డారు.

అదేవిధంగా సబ్ మార్కెట్ యార్డుల పరిసర ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి రైతులు, వ్యాపారులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని నిర్ణయించారు. మార్కెట్ యార్డులకు వచ్చే రైతులకు తాగునీరు, విశ్రాంతి గదులు, విద్యుత్ సౌకర్యం, పారిశుధ్య వసతులు, భద్రతా ఏర్పాట్లు వంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సమావేశంలో సూచించారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న--సదానందం మాట్లాడుతూ, రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను మార్కెట్ కమిటీ ద్వారా సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధర పొందేలా, మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన ప్రతి సౌకర్యాన్ని కల్పించడమే కమిటీ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

సమావేశంలో మార్కెట్ కార్యదర్శి ఎన్. రాజా, వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, సభ్యులు శ్రీపతి రెడ్డి, సునీల్, సతీష్, రాజేశ్వరరావు, సదానందం, సురేష్, దీక్షిత్, శ్రీనివాస్ రెడ్డి, రషీద్ పాషా, తిరుపతి, శ్యామ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ సమావేశానికి హాజరై రైతుల అభివృద్ధి, మార్కెట్ యార్డుల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధిపై తన సూచనలు చేశారు.

మొత్తంగా రైతులకు మరింత చేరువగా మార్కెట్ సేవలను విస్తరించడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తులో రైతాంగానికి ఎంతో ఉపయోగపడనున్నాయని సభ్యులు అభిప్రాయపడ్డారు.

# స్నేహితుడు దూరమైనా.. స్నేహం దూరం కాలేదు..



**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), జూన్ 10:** ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక మే 30న ఆత్మహత్యకు పాల్పడిన సింహరాజు శివకుమార్ కుటుంబానికి ఆయనతో కలిసి చదువుకున్న మిత్ర బృందం అండగా నిలిచింది. తమ ఆత్మీయ మిత్రుడు ఆర్థిక కష్టాలతో ప్రాణాలు కోల్పోయాడనే వార్త తెలుసుకుని తీవ్ర మనోవేదనకు గురైన స్నేహితులు, కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ, శివకుమార్ మరణం తమను తీవ్రంగా కలచివేసిందని, కష్టకాలంలో ఆయన కుటుంబానికి తమ వంతు బాధ్యతగా ఈ సహాయం అందిస్తున్నామని తెలిపారు. డబ్బుతో అతడిని తిరిగి తీసుకురాలేకపోయినా, అతని కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వడం తమ కర్తవ్యమని పేర్కొన్నారు. స్నేహం అంటే కేవలం ఆనందాలను పంచుకోవడం మాత్రమే కాదు, ఆపదలో అండగా నిలవడం కూడా అని మిత్రబృందం తమ చర్యతో చాటిచెప్పింది. భవిష్యత్తులో కూడా శివకుమార్ కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ ఘటన మానవత్వానికి, నిజమైన స్నేహానికి నిదర్శనంగా నిలిచిందని స్థానికులు అభినందిస్తున్నారు.

# బదిలీపై వెళ్తున్న కేడీసీసీ బ్యాంకు ఉద్యోగులకు ఘన సన్మానం



**కరపత్రం ప్రతినిధి వేములవాడ** వేములవాడ పట్టణంలోని కేడీసీసీ బ్యాంకులో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న బ్యాంకు సిబ్బంది అరుణ్ కుమార్, ఝాన్సీ, శ్రీకాంత్‌లను బుధవారం స్థానిక ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి వారికి శాలువాలు కప్పి సత్కరించి, రాజన్న చిత్రపటాన్ని అందించి,బ్యాంకులో అందించిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమైనవేనని, తాము పనిచేసిన ప్రాంతంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిన ఉద్యోగులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్లు రాజయ్య, సంజీవరెడ్డి, కొండ శేఖర్, అమృత, సీఈఓ లక్ష్మణ్, మాజీ డైరెక్టర్లు గుడిసె సదానందం, రాచర్ల మహేందర్, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ విజయ్ పవన్, ఉద్యోగులు సతీష్, శ్వేత, లావణ్య, అంజలి, విమల, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు.. తెలంగాణ దేశానికి ఆదర్శం



- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ** వేములవాడ మున్సిపల్ 11, 24 వార్డులతో పాటు రూరల్ మండలం మల్లారం గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసి, వర్షాకాల సన్నద్ధత, పారిశుధ్యం, జల సంరక్షణ, వనమహోత్సవం, మహిళల భద్రత, వ్యవసాయ రంగ అభివృద్ధి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని, అర్హులందరికీ కుల, మత, పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళు మంజూరు చేస్తున్నామని తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం పంటల మార్పిడి, ఆయిల్‌పామ్, పప్పుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, ఆర్డీవో కే ఎస్ బి కుమారి, కమిషనర్ లోకేష్, డీఎస్పీ శ్రీనివాసులు, పట్టణ సీఐ బి. వీరప్రసాద్, మండల ప్రత్యేక ఆఫీసర్ లక్ష్మిరాజం, మల్లారం సర్పంచ్ అర్పిత-వీరారెడ్డి, వార్డు కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు..

# డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్ జన్మదినం సందర్భంగా వైభవంగా అన్నదాన కార్యక్రమం




**కరపత్రం ప్రతినిధి నార్కెట్‌పల్లి, జూన్ 10:** నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుడు పున్న కైలాష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన ఆత్మీయులు సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. పల్ల రవితేజ, దామనూరి అశోక్, రాధారాపు దశరథ్, గొడుగు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిత్యం ఉచిత భోజనం మనం స్వచ్ఛంద సంస్థలో 582వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి నిరుపేదలు, నిస్సహాయులు, బిక్షాటన చేసేవారు, బాటసారులకు చికెన్ బిర్యానీతో భోజనం అందజేశారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపిన నాయకుడు పున్న కైలాష్ జన్మదినం సందర్భంగా ఆయన పేరుతో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సమాజంలో ఆకలితో బాధపడుతున్న వారికి ఆహారం అందించడం కన్నా గొప్ప సేవ మరొకటి లేదని పేర్కొన్నారు.

గొడుగు అనిల్ కుమార్ మాట్లాడుతూ తమ జీవితంలోని ముఖ్యమైన రోజులను సేవా కార్యక్రమాలకు అంకితం చేస్తూ నిరుపేదల ఆకలి తీర్చడానికే ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ సృష్టిలో ఆకలికి మించిన లోటు మరొకటి లేదని, ఎవరూ ఆకలితో అలమటించకూడదనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి మోజేష్, జిట్ట శ్రీకాంత్, బోడ నందు తదితరులు పాల్గొని అన్నదాన సేవలో భాగస్వాములయ్యారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో నిర్వహించడం పట్ల స్థానికులు నిర్వాహకులను అభినందించారు.

# పేద కుటుంబానికి అండగా నిలిచిన వ్యాల్ల హరీష్ రెడ్డి



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 10:**
మాతంగి కాలనీకి చెందిన సింహరాజు శివకుమార్ గత నెల 30న ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. శివకుమార్ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి మానవత్వంతో ముందుకు వచ్చి వారి కుటుంబానికి అండగా నిలిచారు. శివకుమార్ పెద్దకర్మ సందర్భంగా మాతంగి కాలనీ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యాల్ల హరీష్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ కుటుంబ సభ్యులు తమ కష్టకాలంలో సహాయం చేసిన హరీష్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ తోడుగా ఉంటూ, అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందించడం హరీష్ రెడ్డి ప్రత్యేకత అని స్థానికులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కంకల దేవేందర్, బూరుగు వంశీకృష్ణ, జెట్టి చందు, రాచర్ల సాగర్, వెజ్జ సదన్ తదితరులు పాల్గొన్నారు.

# కర్ణవేదన వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు -- చిన్నారి శివాత్మికకు ఆశీర్వాదాలు

**కరపత్రం ప్రతినిధి వీణవంక, జూన్ 10:**



వీణవంక మండల కేంద్రానికి చెందిన రసపల్లి దివ్య -- శ్రీనివాస్ దంపతుల కుమార్తె శివాత్మిక కర్ణవేదన కార్యక్రమం కోరపల్లిలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్‌లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకకు హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నారి శివాత్మికను ఆశీర్వదించి, ఆమెకు ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగాలని కోరారు.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, నాయకులు గంగాడి తిరుపతి రెడ్డి, కొమ్మిడి రాకేష్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, కలికొండ మధుకర్, జిల్లా కార్యదర్శి కంకణాల జగదీశ్వర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు మాదాసు సునీల్, ఎండీ రషీద్, మాజీ సర్పంచ్‌లు పంజాల సతీష్, పానుగంటి మధుకర్ తదితరులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.
కుటుంబ సభ్యులు కార్యక్రమానికి విచ్చేసిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, బంధుమిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుక ఆత్మీయ వాతావరణంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది.

# మీర్‌ఖాన్‌పేట్‌లో ఎఫ్ డిసిఏ కార్యాలయ ప్రారంభోత్సవానికి తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు

**రంగారెడ్డి జిల్లా: మీరు ఖాన్ పెట్, జూన్ 10 / కరపత్రం ప్రతినిధి**





తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మీర్‌ఖాన్‌పేట్‌లో ప్రారంభించనున్న ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి, అనంగల్ల యాదయ్య, గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, చిందం శ్రీశైలం, మానిపాటి వెంకటేష్, పంబాల శివకుమార్, బుడిగల పరమేష్, కంబాలపల్లి బుగ్గరాములు, చిందం ఐలయ్య, ఎన్నిదుల మహేష్, ఎం.డి. రఫీక్, ఎం.డి. అశ్రఫ్, ఆదెపు మధు, గొరిగే కృష్ణ, అనంగల్ల రమేష్, గడ్డం సత్తయ్య, చీమల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటనకు ముందే జమ్మికుంటలో రాజకీయ దుమారం

- ఆకుల రాజేందర్ జన్మదిన ఫ్లెక్సీలు చింపివేత ఘటన కలకలం, బీజేపీలో అంతర్గత విభేదాలపై కార్యకర్తల అనుమానాలు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 10:**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జూన్ 11న జరగనున్న పర్యటనకు ముందే రాజకీయ వాతావరణం వేడెక్కింది. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రహదారులు, ప్రజా ప్రదేశాల్లో భారీ ఎత్తున ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేశారు.
అయితే రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కొన్నిచోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పోస్టర్లను చింపివేయడంతో ఈ ఘటన స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కేంద్ర మంత్రి పర్యటనకు స్వాగతం పలుకుతూ, ఆకుల రాజేందర్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేయడం వెనుక రాజకీయ కోణం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
ఈ ఘటనపై కొందరు బీజేపీ కార్యకర్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, పార్టీ అభివృద్ధిని చూసి ఓర్వలేని వ్యక్తులు కావాలనే ఈ చర్యలకు పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. మరికొందరు కార్యకర్తలు మాత్రం పార్టీ అంతర్గత విభేదాలు, వర్గపోరాటాల నేపథ్యంలోనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై ఎలాంటి అధికారిక నిర్ధారణ లేకపోయినా, కార్యకర్తల మధ్య చర్చకు దారితీసింది.








ఫ్లెక్సీలు చింపివేసిన ఘటనపై బీజేపీ కార్యకర్త సిరియాల విజయ జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదులో ప్రజా ఆస్తులకు నష్టం కలిగించడంతో పాటు పార్టీ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది.
ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి రాజకీయ పార్టీకి తమ కార్యక్రమాలను నిర్వహించుకునే హక్కు ఉందని, నాయకుల పర్యటనలు, జన్మదిన వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన పోస్టర్లు, ఫ్లెక్సీలను ధ్వంసం చేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు రాజకీయ సంస్కృతికి మచ్చ తెస్తాయని వారు అన్నారు.
కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటన నేపథ్యంలో పార్టీ శ్రేణులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.
ఈ ఘటనపై పోలీసులు ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. సీసీటీవీ కెమెరాల ఫుటేజీలు, స్థానికుల సమాచారాన్ని ఆధారంగా తీసుకుని పోస్టర్లు చింపివేసిన వ్యక్తులను గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది.
"కార్యకర్తల కష్టాన్ని అవమానించేలా వ్యవహరించిన వారెవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. రాజకీయ భేదాలు ఉన్నా ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలి" అని పలువురు బీజేపీ కార్యకర్తలు పేర్కొన్నారు.

# మల్యాల గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా మొక్కల నాటకం







- మాదకద్రవ్యాల నిర్మూలన -- రహదారి భద్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించిన రూరల్ సీఐ పులి వెంకట్

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, జూన్ 10:**
పర్యావరణ పరిరక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలన మరియు రహదారి భద్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించే లక్ష్యంతో ఇల్లందకుంట మండలంలోని మల్యాల గ్రామంలో జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టి పచ్చదనం పెంపొందించేందుకు గ్రామస్థులకు పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో ఇల్లందకుంట ఎస్‌హెచ్‌వో జి. సదయ్య, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, యువత, మహిళలు మరియు గ్రామస్థులు పాల్గొని మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని సీఐ పులి వెంకట్ తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజానికి మాదకద్రవ్యాలు పెద్ద సవాలుగా మారాయని అన్నారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా విద్య, ఉపాధి, క్రీడల వైపు దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని వివరించారు. గ్రామాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.
అనంతరం "అరైవ్ అలైవ్" రహదారి భద్రతా కార్యక్రమంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు వినియోగించాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాల గురించి వివరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు.
ప్రజల భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలన, రహదారి భద్రత వంటి లక్ష్యాలను సాధించవచ్చని అధికారులు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, విద్యార్థులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు సమాజానికి అవసరమైన అవగాహన కల్పించిన పోలీసు శాఖను గ్రామస్థులు అభినందించారు.

# 99 రోజుల ప్రజాపాలనలో గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం -- శనిగరం గ్రామసభలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ రాణి రవీందర్

**కరపత్రం ప్రతినిధి కమలాపూర్, జూన్ 10:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కమలాపూర్ మండలంలోని శనిగరం గ్రామంలో గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామసభలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.
గ్రామ ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, అభ్యర్థనలు, అభివృద్ధి పనుల అవసరాలపై అధికారులు వివరాలు సేకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు ప్రతి శాఖ సమన్వయంతో




పనిచేయాలని చైర్మన్ పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి, సీఐ నవీన్, మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి రాజు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




గ్రామసభ ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడం ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధిని మరింత వేగవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# వెల్దుర్తి గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభ

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట జూన్ 10**
మెదక్ జిల్లావెల్దుర్తి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ లో బుధవారం నాడుప్రజా పాలన --ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆదర్శ్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు ఈ గ్రామ సభలో వ్యవసాయ విస్తరణాధికారి మజ్జిద్ అలీ, ఏఎస్ఐ లక్ష్మణ్, పాల్గొన్నారు ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ వర్షా కాలంలో సురక్షిత తాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ--మన సంరక్షణ, మొక్కల పెంపకం వన మహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, వరద







నిర్వహణ--భద్రతపై తగు సూచనలు చేస్తూ అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ గ్రామంలోని ఇంటి పరిసర ప్రాంతాలలో ఎలాంటి పిచ్చి మొక్కలు ఉన్న వాటిని తీసివేయాలని ఇంటి పరిసర ప్రాంతాలలో ఎటువంటి మరుగు దొడ్డును కానీ మురికి కాలువ కానీ ఉన్న వాటిని శుభ్రపరచుకునే విధంగా అందరూ కృషి చేస్తే గ్రామంలోని ఉన్న గ్రామ ప్రజలకు ఎటువంటి అనురోగాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో, గ్రామ సర్పంచ్ ఆదర్శ్, ఉప సర్పంచ్ శ్రావణ్, వార్డు సభ్యులు శాకారం. శ్రీనివాస్, అంగడిపేట మహేందర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు